మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# పథకాల అమలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

◆ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
◆ బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ మెరుగుపరచాలి
◆ జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో ఎంపి డికె అరుణ
◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 26 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరిగేలా అధికారులు చర్యలుతీసుకోవాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్య వేక్షణ కమిటి (దిశ) సమావేశం మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు డికె అరుణ అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులతో, కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లోటుపాట్లు ఉంటే సరి చేసుకుని పరిష్కారం పూర్తి స్థాయిలో అమలు జరిగి ప్రజలకు ఉపయోగపడేలా సమావేశంలో సమీక్షించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు మేలుచేసే ఉద్దేశంతో ఆయా పథకాలు ప్రభుత్వాలు అమలు చేస్తున్నా యని పథకాల అమలు తీరు దిశ సమావేశంలో సమీక్షించి ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర పథకాలు లోపాలు లేకుండా పటిష్టంగా అమలుకు అధికారులు అంకిత భావంతో అభివృద్ధికి కృషి చేయాలని, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి దిశ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని తదుపరి సమావేశం జనవరిలో ఉంటుందని తెలిపారు. వచ్చే సమావేశంలో ఆయా పతకాలు సాధించిన ప్రగతి సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. దిశ సమావేశంలో అన్ని శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలు సమావేశంలో సమీక్ష చేశారు. బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సరిగా లేదని బిఎస్ ఎన్ఎల్ నుండి ఇతర నెట్‌వర్క్‌కు ప్రజలు మారుతున్నారని, గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో నెట్‌వర్క్‌ను మెరుగు పరచాలని ఆమె సూచించారు. నేషనల్ హైవే రహదారి 167 ఎన్ పనులపై సమీక్షించారు. డిఆర్‌డిఓ ద్వారా నూతన పెన్షన్ల దరఖాస్తుల గురించి పార్లమెంట్ సభ్యులు అడిగారు. దరఖాస్తులు ఎంపిడిఓలుతీసుకుంటున్నారని డిఆర్‌డిఓ తెలిపారు. ప్రభుత్వం లాగిన్ ఓపెన్ చేస్తే ఎంట్రీ చేయడానికి ఆప్షన్ ఉంటుందని డిఆర్‌డిఓ తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రతి జిపి భవనం ఉండాలని డికె అరుణ సూచించారు. పరిశ్రమల శాఖ యువతకు ఉపయోగపడే యూనిట్లు ఏ విధంగా పెట్టుకోవాలి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో చిన్న కుటీర పరిశ్రమలు, కాటేజీలు నెలకొల్పటానికి ప్రతి మండలంలో ఎంపిడిఓల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. వ్యవసాయశాఖకు సంబంధించి కొన్ని పథకాలు నిధులు రాక ఆగిపోయినట్లు, కారణాలు వచ్చే సమావేశంలో పూర్తి స్థాయిలో సమాచారం అందించాలని అన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు.



దిశా సమావేశంలో పాల్గొన్న అధికారులు

# ప్రభుత్వ పథకాలపై సమాచారం ఇవ్వాలి

● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 26 ప్రభాతవార్త :** రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు చెందిన ఏ పథకం వచ్చినా స్థానిక ఎమ్మెల్యే, ఎంపిలకు తప్పకుండా సమాచారం ఇవ్వాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శనివారం మహబూబ్‌నగర్ ఐడిఓసిలో మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వచ్చే ఎలాంటి పథకాలకు శంకుస్థాపన కార్యక్రమంలో చేస్తున్నా, విధిగా సమాచారం అందించాలని ఆయన స్పష్టం చేశారు. ఏదో మా ప్రచారం కోసం మేము చెప్పడం లేదని, ప్రభుత్వం ఇచ్చే స్కీంలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ పథకాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కోసం స్థానిక ఎమ్మెల్యే, ఎంపిలకు తెలియజేయాలని వారు సూచించారు. రాష్ట్రంలోని 65 ఐటిఐ కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఎటిసిలుగా అప్‌గ్రేడ్ చేసి హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసి ప్రారంభించారని, ఇక్కడ మహబూబ్‌నగర్‌లో ఎటిసిగా అప్‌గ్రేడ్ అయిన ఐటిఐ కళాశాలను తాను వెళ్లి చూసిన రోజు కేవలం 9 మాత్రమే అప్లికేషన్స్ వచ్చాయని, నిన్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఎటిసి సెంటర్ కోసం శంకుస్థాపన చేస్తే వెంటనే 120 అప్లికేషన్స్ వచ్చాయని ఆయన తెలిపారు. అందుకే మనకు వచ్చిన ఏ స్కీం అయినా అది కేంద్రం నుంచి కాని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కాని వచ్చిన వెంటనే మా దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ముద్రా లోన్లు ఎందుకు సరిగ్గా ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. ముద్రా స్కీం యొక్క ముఖ్యఉద్దేశం పూర్తిగా పక్కదారిపడుతున్నాయని మండిపడ్డారు. ఈ స్కీపేద, మధ్య తరగతి మహిళలకు, వీధివ్యాపారులకు ఎలాంటి ఆధారం లేని వారికోసమే ముద్రా స్కీంను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి మరి బ్యాంకులు ఎందుకు ఈ స్కీంను విస్మరిస్తున్నారని, మహబూబ్‌నగర్‌లో ఎంతమందికి ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ, రేషన్ షాపులు, వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, ఇరిగేషన్, ఫారెస్టు, కో ఆపరేటివ్, బ్యాంకు, ఇతర అన్ని శాఖలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిరబోయి, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మద్దూర్ సతీష్ కుటుంబ సభ్యులకు
# ముఖ్యమంత్రి పరామర్శ



సతీష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

◆ మద్దూర్ సతీష్ దశదినకర్మకు హాజరైన ముఖ్యమంత్రి
◆ సతీష్ చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు
◆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని సీఎం భరోసా



సతీష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం

**నారాయణపేట టౌన్, అక్టోబరు26 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ సతీష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సతీష్ తల్లిదండ్రులు, భార్యా పిల్లలతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా మద్దూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సతీష్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా మద్దూరుకు చేరుకుని సతీష్ స్వగృహంలో నిర్వహించిన దశ దినకర్మ కార్యక్రమానికి హాజర య్యారు. సతీష్ కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ భార్య సంగీత తన ఇద్దరు కుమా రులు వీరేష్, ఆదిత్యల ఉన్నత చదువులకు సాయం చేయాలని సీఎంను కోరగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీల లో ప్రతిభ చాటిన సతీష్ తమ్ముడు మణికంఠ తనకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశం ఇప్పించాలని రెజ్యూమ్‌ను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయగా పరిశీలించాలని అక్కడి ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిని సీఎం ఆదేశించారు. అలాగే సతీష్ -మిగతా4లో..

## నీరు మన జీవనాధారం..
# నీటి సంరక్షణ మనందరి బాధ్యత

◆ జల్ శక్తి అభియాన్ జాయింట్ కమిషనర్ అమిత్ శుక్ల





పండ్ల తోటలను పరిశీలిస్తున్న అమిత్ శుక్ల

**గద్వాల అక్టోబరు 26 ప్రభాతవార్త:** శనివారం కేటిదొడ్డి రైతు వేదికలో ఏర్పాటు చేసిన జలశక్తి అభియాన్ క్యాచ్ ది రెయిన్ 2024 నారిశక్తి జల శక్తి అనే ఇతివృత్తం పై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జల శక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రెటరీ అమిత్ శుక్ల మాట్లాడుతూ, నీరు మన జీవనాధారమని, నీటి సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని వర్షపు నీటిని సంరక్షించుకునేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని అన్నారు. ఈ ప్రాంతంలో వర్షపాతం చాలా తక్కువగా ఉన్నందున నీటి కొరత తలెత్తకుండా ప్రజలు నీటిని రక్షించాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలు ఏమిటో తెలుసుకొని, వాటికి ఉత్తమమైన పరిష్కార మార్గాలను సూచించారు. రాబోయే ఐదు సంవత్సరాలలో నీటిని సంరక్షించడానికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమని అన్నారు. ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భజలాలను పెంచుకోవాలన్నారు. సాగు కోసం రైతు సమూహాలకు బోరుబావుల రీచార్జ్ సౌకర్యం అందించడం ముఖ్యమని వివరించారు నీటి వృథా నివారించేందుకు సరైన నీటి చానెల్స్ నిర్మించాలన్నారు. ముఖ్యంగా మహిళలు భాగస్వామ్యంపై ఈ కార్యక్రమంలో ముందుండి నీటిప్రాధాన్యతను అందరికి తెలియజేయాలని అన్నారు. చెట్లు పెంచడం, వివిధ రకాల పండ్ల తోటలను పెంచాలన్నారు. సహజ వనరులను సమర్ధవంతంగా వినియోగించడం ద్వారా ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడగలమని అన్నారు. నీటిని వృథా చేయకుండా, అవసరానికి తగిన విధంగా మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా అందరూ నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం యన్‌ఆర్ఈజిఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన పండ్ల తోటల పెంపకం ఉద్యానాన్ని సందర్శించారు. ఈ సమావేశంలో జలశక్తి అభియాన్ టెక్నికల్ ఆఫీసర్ మధుసూదన్, డిఆర్‌డిఓ నర్సింగ్‌రావు, అడిషనల్ డిఆర్‌డిఓ నరసింహ, స్వయం సహాయక సంఘం మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పిల్లల హృదయ వ్యాధుల వైద్య శిబిరం

**వనపర్తి అక్టోబరు26 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో ఆరోగ్యవంతులైన యువతను తయారు చేసేందుకు రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమ్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం ఉదయం వనపర్తి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన చిన్న పిల్లల హృదయ వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి సందర్శించారు. ఆర్.బి.ఎస్.కే ద్వారా ఎస్.యం.డి.సి సౌజన్యంతో హృదయ ఫౌండేషన్, హైదరాబాద్ వారు వనపర్తి జిల్లాలో హృదయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. స్టార్ హాస్పిటల్ పిడియాట్రిక్ కార్డియాలజీస్ట్ డా.సుమన్ బ్యాస్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 84 మంది చిన్నారులను పరీక్షించగా (11) మంది చిన్నారులకు శస్త్ర చికిత్సలు అవసరం కాగా మరో 13 మంది చిన్నారులకు వైద్య సేవలు అవసరమని డాక్టర్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు సైతం ఆరోగ్య శ్రీ కింద హైదరాబాదులో ఉచితంగా నిర్వహించడం జరుగుతుంది. జిల్లాలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు హృదయ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని చిన్నారులను ఆరోగ్యవంతులను చేసేందుకు ఆర్.బి.ఎస్.కే ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో వెళ్లి పాఠశాలల్లో విద్యార్థులు ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడం, అనీమియాతో బాధపడుతున్నవారికి వైద్య చికిత్సలు చేయడం, క్రమం తప్పకుండా టీకాలు వేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.జయచంద్ర మోహన్, ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, డా.సాయినాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్, వైద్య సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## నూతన సాంకేతిక పద్ధతులతో
# వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్




రైతుల సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల అక్టోబరు 26 ప్రభాతవార్త:** రైతులు నూతన సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. శనివారం గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ గంజిలో ఏర్పాటు చేసిన గద్వాల రైతు సదస్సు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా వారు పూజా కార్యక్రమం నిర్వహించి, ఆ తరువాత కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఉద్యానవనశాఖ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ స్టాల్స్‌లో విత్తనాలు, వ్యవసాయ, ఉద్యానవన పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్ ఉత్పత్తులు, ఎరువులు, పురుగుమందులు, వినూత్న పరికరాలు వంటి వ్యవసాయ, ఉద్యానవనానికి సంబంధించిన పలు వస్తువులు ప్రదర్శించబడ్డాయి. ప్రతి స్టాల్స్‌ను పరిశీలించి అందులో ప్రదర్శించిన సాంకేతికత, ఆధునిక పద్దతులపై వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లాలో ప్రజలు సుమారు 80 శాతం మంది జీవనాధారం వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారని అన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఆధునిక పద్ధతుల మీద అవగాహన కల్పించేందుకు, పల్లె సృజన, గద్వాల ఎమ్మెల్యేతో కలిసి ఈ రైతు సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సదస్సులో మొత్తం 40 స్టాల్స్ ఏర్పాటు చేయగా ఇందులో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్ ఉత్పత్తులు ఆర్గానిక్ ఎరువులు, నానో టెక్నాలజీ ఆధారిత యూరియా, వరి, పత్తి పంటలు సాగు అవుతున్నాయని అన్నారు. హార్టికల్చర్, అగ్రికల్చర్ ఇతర డిపార్ట్‌మెంట్ ల ద్వారా రైతులకు అధిక లాభాలను కలిగించే పంటల గురించి అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఒక ఎకరా వరి పంట సాగు చేయడానికి సుమారు 12 లక్షల లీటర్ల నీరు అవసరం కాగా, కందిపప్పు, హార్టికల్చర్ వంటి ఇతర డ్రై పంటలకు కేవలం 5-6 లక్షల లీటర్ల నీరుతోనే పంటను సాగు చేయవచ్చని అన్నారు. ఇది నీటి వనరులను సంరక్షించడంలో మాత్రమే కాకుండా, రైతులకు ఖర్చు తగ్గించడంలో కూడా సహాయపడుతుందని అన్నారు. తక్కువ నీటితో మంచి దిగుబడులు అందించే పంటలు కందిపప్పు, పామ్ ఆయిల్, డ్రాగన్ ఫ్రూట్, బత్తాయి మొదలైనవి తీసుకోవాలని పేర్కొన్నారు. ఇటువంటి పంటలు వేసుకోవడానికి అవసరమైన సాంకేతిక సహాయం కోసం పరికరాలు, టెక్నాలజీ స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ పనిని సులభంగా నిర్వహించేందుకు చిన్న చిన్న యంత్రాలు, డ్రోన్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పది మంది చేసే పనిని ఇద్దరు చేయగలిగేలా వినూత్న పరికరాలు ఈ స్టాల్స్‌లో ఉన్నాయని అన్నారు. దీనివల్ల కూలీల అవశ్యకత తగ్గి, పంటలపై వ్యయాన్ని తగ్గించవచ్చని అన్నారు. నానో టెక్నాలజీ ద్వారా తయారైన ఫర్టిలైజర్స్ వాడడం ద్వారా అధిక దిగుబడులు, ఖర్చులు తగ్గుతాయని అన్నారు. ప్రతి స్టాల్ మన రైతులకు అవసరమైన సూచనలతో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రైతులు ప్రతి ఒక్క స్టాల్‌ను డీటెయిల్‌గా పరిశీలించి, తాము -మిగతా4లో..

# ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

● స్యామ్ మ్యామ్ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలి
● క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి అక్టోబరు 26 ప్రభాతవార్త :** వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లల వైద్య నిమిత్తం ఏర్పాటు చేసిన ఎన్.ఆర్.సి లో నిర్దిష్టమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం ఉదయం వనపర్తి మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని స్యామ్ మ్యామ్ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి వయస్సుకు తగ్గఎత్తు, బరువు లేకుండా ఉండటానికి గల కారణాలు తెలుసుకొని చికిత్సతో పాటు అక్కడే పౌష్టికాహారం అందించి ఆరోగ్యం చేకూర్చేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసిన ఎన్.ఆర్.సి కేంద్రంలో పూర్తి స్థాయి ఫలితాలు సాధించాలని వైద్యులను ఆదేశించారు. జిల్లాలో దాదాపు 200 వరకు స్యామ్, మ్యామ్ పిల్లలు ఉన్నట్లు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా గుర్తించడం జరిగిందని వారిని ఎన్.ఆర్.సి కేంద్రానికి రప్పించి వయస్సుకు తగ్గ ఎత్తు బరువు లేకుండా ఉండటానికి గల కారణాలను అవసరమైన రక్త పరీక్షల ద్వారా తెలుసుకొని సరైన వైద్యంతో పాటు అక్కడే పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఇక్కడ ఉన్న వైద్య సిబ్బందితో పాటు ఒక అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్, ఆశా వర్కర్ ను అందుబాటులో ఉంచే విధంగా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంతమంది పిల్లలను తీసుకువచ్చారు. వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది బరువు పెరిగేలా అని ఆరా తీశారు. రిజిస్టర్లు పరిశీలించారు ఎన్.ఆర్.పి అనేది ఒక అడ్వాన్సు వైద్య కేంద్రమని, ఇక్కడ పిల్లలను ఆరోగ్యవంతులును చేసేందుకు ఒక నిర్దిష్టమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానం అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నిబంధనల మేరకు పిల్లల వెంట వచ్చే తల్లికి రోజుకు కొంత డబ్బును చెల్లించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య సంరక్షణపై తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించాలని సూచించారు. అనంతరం పక్కనే కొత్తగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆధునిక వైద్య విధానంలో ప్రాణాలు కాపాడేందుకు ఉద్దేశించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, వైద్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. లేబర్ శాతం పెంచాలని డిసెంబర్ చివరి నాటికి నిర్మాణం పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించారు. మాతా శిశు కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న సి.టి స్కాన్ యూనిట్ ను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సి.టి స్కాన్ -మిగతా4లో..

# ధాన్యం కొనుగోలు పకడ్బందీగా నిర్వహించాలి

◆ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**చిన్నచింతకుంట, అక్టోబరు 26 ప్రభాతవార్త:** వరిధాన్యం కొనుగోలును అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నెల్లికొండి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేస్తామని గ్రేడ్ ఏ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2320, గ్రేడ్ 2కు రూ. 2300గా ప్రభుత్వం మద్దతు ధర ఉంటుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పండించిన పంటను కల్లాలలో పెట్టుకుని కొనుగోలు కేంద్రాల కోసం రైతులు ఎదురు చూస్తూ ఇబ్బందులు పడ్డారన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో రైతులకు 15 రోజులు ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని రైతులుపండించిన ప్రతి గింజనుప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలు తూకాల్లో మోసాలకు తావు లేకుండా వరి ధాన్యంలో తాలు, తరుగు పేరిటఎలాంటి కటింగ్ ఉండవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఈ సీజన్ నుండి సన్నరకం వరి ధాన్యంపై రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రంలో అధికారులు, సిబ్బంది తప్పిదాలుతో రైతులు ఇబ్బందులు పడినా బిల్లుల చెల్లింపులో పాజ్యం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్లప్ప, ఎపిఎం విష్ణుచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరెందర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్, నాయకులు వట్టెం శివకుమార్, కృష్ణ కుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

# ఫారెస్టు పంచాయితీ

● పోడు భూముల సాగులో ఫారెస్టు అధికారులకు, గిరిజనుల మధ్య వాగ్వివాదం
● తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకున్న వైనం



అడ్డుకుంటున్న గిరిజనులు

**కొల్లాపూర్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలపరిధిలోని నల్లమలలోని ఎర్రగట్టు బొల్లారం సమీపంలో పోడు భూముల రగడ నెలకొంది. ఫారెస్టు అధికారులకు గిరిజనులకు వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకుంది. కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఫారెస్టు భూములలో చెట్లు నాటుతుంటే గిరిజనులు అడ్డుకున్నారు. -మిగతా4లో..

## కొత్తకోట మున్సిపల్ వార్డ్ ఆఫీసర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**అమరచింత అక్టోబరు26 ప్రభాతవార్త:** కొత్తకోట మున్సిపల్ వార్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జయ రాములు పై దాడికి నిరసనగా శనివారం అమరచింత మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు మున్సిపల్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అమరచింత మున్సిపల్ వార్డు ఆఫీసర్లు మునిస్వామి బాబు లక్ష్మయ్య గోపాల్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న వార్డ్ ఆఫీసర్ జయ రాములు పై మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పొగాకు విశ్వేశ్వర్ దాడి చేయడం అన్యాయమని వారన్నారు. వివాదంలో ఉన్న ఫైలు పై వార్డ్ ఆఫీసర్ జయ రాములు సంతకం పెట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ భర్త ఒత్తిడి చేయడంతో వార్డ్ ఆఫీసర్ సంతకం చేయనందుకు దాడి చేయడం సిగ్గుచేటని దాడి చేసిన విశ్వేశ్వర్ పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



అమరచింత మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

## మూడు ఉద్యోగాలు సాధించిన ఓంకార్‌కు సన్మానం

**పెబ్బేరు అక్టోబరు 26 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కృష్ణయ్య పద్మమ్మల 3 వ సంతానం ఐనా ఓంకార్ ఇటీవల విడుదలయిన డిఎస్సీ ఫలితాలలో ఉద్యోగం సాధించినఓంకార్‌కి మండల అధ్యక్షులు వనం రాములు ఆధ్వర్యంలో పూలమాల శాలువాలతో సన్మానించడం జరిగింది. రాంపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంలో పుట్టి 3 గవర్నమెంట్ ఉద్యోగాలు సాధించిన చివరికి తనకు ఇష్టమైన టీచర్ ఉద్యోగానికి పోతూ పాఠశాలలోనే రేపటి భావితారం తయారు అవుతారు అని నమ్మి వారిని తయారు చేయడంలో నా పాత్ర కూడా ఉండాలని నమ్మి సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాన్ని వదులుకున్నానని వారు అన్నారు. తన కుంటుంబ సభ్యుల కృషి వల్లే తన కళలను నిజం చేసుకున్నానని తన పేద పరిస్థితిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పెద్దింటి వెంకటేష్ ,విరస్వామి ,సోషల్ మీడియా కన్వీనర్ వడ్డె రమేష్,మొగులన్న , మధు, యాదగిరి,మల్లికార్జున్, లక్ష్మన్న, గోకారి,మూర్తి, కొండల్, హర్షవర్ధన్ రెడ్డి, జయరాముడు, నాగన్న, భీముడు, విష్ణు ,శివ, లంకేష్, తదితరులు పాల్గొన్నారు.



ఓంకార్ ను సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## నష్టపోయిన డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయండి

**మక్తల్ టౌన్,అక్టోబరు 26 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూర్, కొడంగల్‌లో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి డీఎస్సీ 2024లో ఓపెన్ మెరిట్ వారిని క్యాటగిరిలో ఉంచడం ద్వారా నష్టపోయిన జె.నరసింహ స్థానిక ఎమ్మెల్యే శ్రీహరికి వినతిపత్రం సమర్పించారు. దీంతో పాటుగా ఇతర బాధితుల సమాచారం డీఎస్సీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేశం వాకబు చేసే రకంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం అందించారు. దానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా ఈ విషం పట్ల ముఖ్యమంత్రితో ప్రస్తావిస్తానని సొంతజిల్లా డీఎస్సీ 2024 బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా తనవంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## పాలకమండలి సభ్యులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**దేవరకద్ర,అక్టోబరు 26 ప్రభాతవార్త:** శ్రీకురుమూర్తి దేవస్థాన పాలక మండలి సభ్యులను దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కురుమూర్తి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా దేవరకద్రకు చెందిన రాముతో పాటు చిన్న రాజమూర్ గ్రామానికి చెందిన గోపాల్‌ను నియమించారు. దీంతో వారిని దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు.



పాలక మండలి సభ్యులతో దేవరకద్ర మండల కాంగ్రెస్ నాయకులు

## కురుమూర్తిస్వామి దేవస్థానం చైర్మన్‌కు సన్మానం

**దేవరకద్ర,అక్టోబరు 26 ప్రభాతవార్త:** శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులను శనివారం దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. దేవస్థానం చైర్మన్ గౌని గోవర్ధన్‌రెడ్డితో పాటు పాలక మండలి సభ్యులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బస్వాయపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కురుమూర్తి పాలక మండలి సభ్యునికి ఘన సన్మానం

**కొత్తకోట అక్టోబరు 26 ప్రభాతవార్త:** పేదల తిరుపతి అయిన కురుమూర్తి దేవస్థాన పాలక మండలి సభ్యునిగా నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్యుడు ఆప్తుడు సౌమ్యుడు బాదం వెంకటేశ్వరన్లు కొత్తకోట మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా శాలువా పూలమాలతో సత్కరించారు. ప్రమాణ స్వీకారం మహోత్సవం సందర్బంగా వారిని ఘనంగా సత్కరించినట్లు విశ్వనాథం వెంకటరమణ తెలిపారు. అదేవిధంగా కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గౌని గోవర్దన్ రెడ్డిని కూడా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యాలు గుంతమల్లేష్, కొండా శ్రీను, బచ్చు వెంకటరమణ,గుంత కిరణ్, కండేనరేష్,పల్లె శ్రీధర్, శ్రీనివాసులు,నరుకులయాదగిరి,మండ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**కొత్తకోట అక్టోబరు 26 ప్రభాతవార్త:** కొత్తకోట మండలం పరిధిలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు కొత్తకోట మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు మొగలి మండల అధ్యక్షుడు రాజవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని చాలామంది విద్యార్థులు స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ మిద ఆధారపడి చదువుకుంటున్నారని రాష్ట్రంలో గత ఆరు సంవత్సరాల నుంచి 8,300 కోట్ల రూపాయల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్ ఉందని అన్నారు. ఉపకార వేతనాల బకాయిలు చెల్లించక పోవడంతో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ పేదవర్గాల విద్యార్థులు కళాశాల చదువులకు దూరం అవుతున్నారని ఫీజు రియంబర్స్మెంట్ , ఉపకార వేతనాల బకాయిలు రూ. 8,300 కోట్లు రూపాయలను వెంటనే విడుదల చేయాలని పేద మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు ఫిజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాల పైన ఆధారపడుతున్నారన్నారని అన్నారు. గత ఆరేళ్లుగా బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్నారని అన్నారు. విద్యార్థులనూ చదువులకు వెళ్లేందుకు సర్టిఫికేట్లు కూడా ఇవ్వటం లేదూ ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తాం అని మాటలు చెప్పడం తప్ప క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు.ఇంతవరకు పైసా ఇవ్వలేదన్నారు.తక్షణమే స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ నాయకులు భాను, భరత్, ఆఫ్రిద్ ,సాయి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

### మండల విద్యాధికారి చంద్రశేఖర్

**ఉప్పునుంతల,అక్టోబరు 26 ప్రభాతవార్త:** విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం తీసుకుని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు చేయాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్ సూచించారు. శనివారం మండలంలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను పెంచి విద్యాభివృద్ధికి తోడ్పాటు నందించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామస్తులను చైతన్యపరుస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేసే విధంగా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## నీటి వనరుల పునరుద్ధరణ పరిరక్షణకై అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

◆ జల్ శక్తి అభియాన్ జాయింట్ కమిషనర్ అమిత్ శుక్ల

**గద్వాల అక్టోబరు 26 ప్రభాతవార్త:** నీటి వనరుల పునరుద్ధరణ, పరిరక్షణకై అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని జలశక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రెటరీ అమిత్ శుక్ల అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జలశక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రెటరీ అమిత్ శుక్లఅన్నారు.శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జలశక్తి అభియాన్ క్యాచ్ ది రెయిన్-2024 నారిశక్తి



మొక్కను నాటుతున్న జల్ శక్తి అభియాన్ జాయింట్ కమిషనర్, కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న అమిత్ శుక్ల

సే జలశక్తి అనే ఇతివృత్తంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనశక్తి అభియాన్ కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ సెక్రెటరీ అమిత్ శుక్ల మాట్లాడుతూ, నీటి సంరక్షణ మరియు నిర్వహణలో మహిళలు కీలక భూమిక నిర్వహించాలని, నీటి సంరక్షణ ప్రాముఖ్యత,భూగర్భజలాలు, నాణ్యమైన నీటి సరఫరా, స్వచ్ఛమైన నీటి వనరుల ప్రాముఖ్యతను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహనకల్పించాలన్నారు. సంబంధిత శాఖలన్ని సమన్వయంతో పని చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో చేపట్టిన వాటర్ బాడీస్ పనులు అన్నింటికి జియో టాకింగ్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్,డిఆర్‌డిఓ శాఖలు జిల్లాలో చేపట్టిన పనులపై పిపిటి ప్రజెంటేషన్ నిర్వహించారు.అంతకుముందు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు.వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో జలశక్తి అభియాన్ టెక్నికల్ ఆఫీసర్ మధుసూదన్, డిఆర్‌డిఓ నర్సింగరావు, జిల్లా ఫారెస్టు అధికారి నవీన్‌రెడ్డి, భూగర్భజలశాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్, జడ్పీసీఈఓ కాంతమ్మ, డిపిఓ శ్యాంసుందర్, ఇరిగేషన్ శాఖ అధికారులు,మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



జల్ శక్తి పథకం పని తీరు తెలుసుకుంటున్న అమిత్ శుక్ల

## రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

**అమరచింత అక్టోబరు26 ప్రభాతవార్త:** రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అచలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కేరాజన్న డిమాండ్ చేశారు. అచలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం అచలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపి తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కే రాజన్న మాట్లాడుతూ ,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామి ఇచ్చిన ఇప్పటివరకు రెండు లక్షల రుణమాఫీ కాక రైతులు బ్యాంకుల చుట్టూ వ్యవసాయ అధికారులు కార్యాలయం దగ్గర పడిగాపులు కాస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు ఎలాంటి షరతులు లేకుండా 2 లక్షల రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే రైతులకు రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు రైతు భరోసా ఇవ్వలేదని వెంటనే రైతులకుపెట్టుబడి సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే రైతులకు అమలు చేస్తున్న రైతు భీమా పంటల భీమా పథకాలకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని ఆయన అన్నారు.ధరణిలో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని పోడు భూములకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హరువులందరికీ పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సి రాజు, వెంకటన్న,చింతల అన్న,ఆంజనేయులు,మణివర్ధన్, కురుమన్న, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.




తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

### ఎస్బిఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**మహబూబ్‌నగర్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ కార్యాలయం, హైదరాబాద్ ఎస్‌బిఐ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ఎస్‌బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సైబర్ సురక్షిత భారత్, నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్నెస్ అక్టోబరు నెల కార్యక్రమంలో భాగంగా శిక్షణార్థులకు అలాగే చుట్టుపక్కల సైబర్ మోసాలపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సైబర్ మోసాల వలన మోసపోకుండా ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి, సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి, సైబర్ మోసాల నుండి సురక్షితంగా ఉండాలని వివరించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ స్కీమ్, 2021 గురించి కూడా వివరించారు. కంప్లెయినట్ మేనేజ్‌మెంట్‌సిస్టమ్ (సిఎంఎస్ పోర్టల్) హెచ్‌టిటిపిఎస్//సిఎంఎస్. ఆర్‌బిఐ.ఓఆర్‌జి.ఇన్‌లో ఎలా కంప్లయిట్ చేయాలెలి. కస్టమర్ మొదటిగా బ్యాంక్ బ్రాంచ్‌లో సంప్రదించి కంప్లయింట్ రాత పూర్వ కంగా ఈమెయిల్ ద్వారా ఇచ్చిన తర్వాత, 30 వర్కింగ్ రోజుల తర్వాత కస్టమర్‌కి న్యాయం జరగకపోతే అప్పుడు మాత్రమే సిఎంఎస్ పోర్టల్‌లో కంప్లయింట్ చేయాలని, ఓటిపి, పాస్‌వర్డ్ ఎవరికి చెప్పరాదని, ఏటిఎం పిన్ నంబర్స్ కూడా తెలుపవద్దని అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా క్విజ్ కూడా నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ స్కీమ్ 2021 గురించి దాంతోపాటు సైబర్ సురక్షిత్ భారత్ గురించి కూడా పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్మయి కుమార్, సిజిఎం అండ్ అంబుడ్స్‌మన్, ఆర్‌బిఐ, హైద్రాబాద్, బాలతేజ,ఎజిఎం, ఆర్‌బిఐ, ఎస్ లోకేష్, ఆర్‌బిఐ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ కార్యాలయం, హైదరాబాద్ ఎస్‌బిఐ నుండి బిపిన్ కుమార్‌సింగ్, డిజిఎం, అనిల్‌కుమార్, ఆర్ఎం, కె. భాస్కర్, ఎల్‌డిఎం శ్రీనివాస్, డైరెక్టర్ ఆర్ఎస్ఇటిఐ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

## విద్యార్థులకు మంచి బోధన అందించాలి

◆ జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

**కొత్తకోట అక్టోబరు26 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలని ఈ అకాడమీక్‌లో అన్ని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి 100 శాతం ఉత్తీర్ణత సాధించేదిశగా ప్రతి ఉపాధ్యాయుడు బోధనను అందించాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ఆదేశించారు. శనివారం కొత్తకోట ప్రాథమిక పాఠశాల దండుగడ్డ,అప్పరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను వివిధ సబ్జెక్టులలో ప్రశ్నల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అప్పరాలలో పదవ తరగతిలో అందరూ కూడా ఉత్తీర్ణులయ్యే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ప్రాథమిక పాఠశాలలో బేసిక్స్ పెంపొందించాలని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను ఆదేశించారు. వీరితో పాటు మండల విద్యాశాఖ అధికారి కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు నర్సమ్మ, ఉపాధ్యాయులు సూరజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

## వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సర్వర్ సమస్యలు

### మ్యానువల్ పద్ధతి కొనుగోలు...!

**వనపర్తి రూరల్ అక్టోబరు 26 ప్రభాతవార్త:** వనపర్తి వ్యవసాయ మార్కెట్ యందు పల్లి (బుడ్డలు) ఆన్లైన్ టెండర్ విధానం పని చేయకపోవడంతో మ్యానువల్ టెండర్ ప్రక్రియను ద్వారా వ్యవసాయదారులకు ఎలాంటి ఇబ్బందులు రైతులకు అనువైన ధరలకు వచ్చే విధంగా అన్ని విధాలుగా అవసరమైన ఏర్పాట్లను మార్కెట్ యార్డ్‌లో కల్పిస్తున్నాం రైతులకు గిట్టుబాటు ధరలతో అమ్మకాలు చేపడతాం అని అన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో సర్వర్ సమస్య రావడంతో తెలుసుకున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ డైరెక్టర్లు అక్కడ ఉన్న సమస్యలను వెంటనే చర్యలు చేపట్టే విధంగా మ్యానువల్ విధానం ద్వారా కొనుగోలు చేపట్టాలి అన్నారు. వనపర్తి వ్యవసాయా మార్కెట్ యందు పల్లి (బుడ్డలు) ఆన్లైన్ టెండర్ విధానం పనిచేయకపోవడంతో మ్యానువల్ టెండర్ ప్రక్రియను పరిశీలించి మ్యానువల్ విధానంలో ఎలాంటి అవకాతవకలు జరుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ,వైస్ చైర్మన్ కొత్తకాపు రామకృష్ణరెడ్డి ,మార్కెట్‌యార్డ్ డైరెక్టర్స్ ,లతీఫ్,సురేష్,గోపాల్ నాయక్, శాంతన్న, మార్కెట్‌యార్డ్ ఉద్యోగులు,మార్కెట్ యార్డ్ సభ్యులు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డ్‌లో సమస్యలను పరిశీలిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్, డైరెక్టర్లు

## ఉప్పునుంతల తహసీల్దార్‌గా కేశవ్

**ఉప్పునుంతల,అక్టోబరు 26 ప్రభాతవార్త:** ఉప్పునుంతల తహసిల్దార్‌గా కేశవులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన తహసిల్దార్ ప్రమీల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా, ఉప్పునుంతల ఉప తహసిల్దార్‌గా పని చేసిన కేశవు లుకు తహసిల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉప్పునుంతల తహసిల్దార్‌గా పని చేసిన ప్రమీల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అచ్చంపేట రెవెన్యూ డివిజన్ అధికారి మాధవి ఆదేశాల మేరకు ఉప తహసిల్దార్ కేశవ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అందరి సహకారంతో అభివృద్ధి బాటలో పయ నించేందుకు కృషి చేస్తానని, మండల ప్రజలు, మండలానికి చెందిన వివిధ పార్టీ నాయకులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. స్థానిక సిబ్బంది సహకారం తీసుకుని మండల ప్రజలకు సేవలందించేందుకు అహర్నిశలు కృషిచేస్తానని ఆయన ఈ సందర్భంగా అన్నారు.



## ఉపాధ్యాయులకు దడ పుట్టిస్తున్న ఎంఈఓ

**ఉప్పునుంతల,అక్టోబరు 26 ప్రభాతవార్త:** మండలంలో నడుస్తున్న పాఠశాలల నిర్వహణపై గతంలోపని చేసిన మండల విద్యాధికారుల పర్యవేక్షణ లోపించడంతోఇష్టానుసారంగా కొనసాగిన పాఠశాలల నిర్వహణ, ప్రస్తుతం కంసానిపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం, నోడల్ అధికారినామని చంద్రశేఖర్ మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాఠశాలలను అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టడంతో ఉపాధ్యా యులకు దడ పుట్టిస్తున్నారని చెప్పవచ్చు. గతంలో పని చేసిన మండల విద్యాధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు డుమ్మాలు కొట్టడం,గ్రామ నాయకుల అండదండలతో కొంత మంది ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధులు నిర్వహించారని ఆరోపణలు వచ్చిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి.ప్రస్తుతం ఎంఈఓ బాధ్యతలు చేపట్టినప్పటినుంచి పాఠశాలల నిర్వహణ పట్లప్రత్యేక దృష్టి సారించిన మండల విద్యాధికారిచంద్రశేఖర్ పట్ల మండలంలోని విద్యావంతులు, మేధావులు, పలువురు ఎంఈఓకు ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నారు.



పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి చంద్రశేఖర్

## జామియా మసీద్ స్థలంలో పారిశుద్ధ్య పనులు చేపట్టండి

● ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్

**అమరచింత అక్టోబరు26 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలోని జామియా మసీదు స్థలంలో మున్సిపల్ అధికారులు వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, కుతుబ్ అధికారులను కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ జామియా మసీదు వెనుక భాగంలో ముళ్ళకంప, మురుగునీరు చేరుతుండడంతో కాలనీలోని ప్రజలకు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాధపడుతున్నారని అనేక మార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు.అలాగే ముస్లింలు నమాజ్ చేయడానికి మసీదు లోపలికి వెళ్లినప్పుడు దుర్వాసన వస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు మాత్రం జామియా మసీద్ స్థలంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం బాధాకరమని ఆయన ఆవేదనత వ్యక్తం చేశారు. ఇప్పటికైనాముస్సిపల్ అధికారులు స్పందించి వెంటనే పారిశుద్ధ్య పనులుచేపట్టాలని ఆయన మున్సిపల్ అధికారులను కోరారు. మున్సిపల్ అధికారులు స్పందించకుంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు.

## బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ఆత్మకూరు అక్టోబరు26 ప్రభాతవార్త:** సమాజంలో బాలలను పరి రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆత్మకూరు మండల తహశీల్దార్ రాజు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుజాత ఆత్మకూరు ఎస్సై నరేందర్ చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు వెల్లడించారు. శనివారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో జరిగిన బాలల పరిరక్షణ కమిటీకి పలువురు అధికారులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనారిటీ తీరకముందే వివాహాలు జరిపించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అంతే కాకుండా చిన్నారి బాలబాలికలను పనిలో పెట్టుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.ఆయా గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ప్రజప్రతినిధులు చిన్నారి బాల బాలికలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే బాధ్యత తీసుకో వాలని వారు విజ్ఞప్తి చేశారు.బాలల పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతి ఒక్కరూ తమ తోడ్పాటు అందించి బాలల హక్కులను కాపాడాలని వారువిజ్ఞప్తి చేశారు. విద్య ద్వారానే సమాజంలోని మూఢనమ్మాకాలను దూరం చేయగలిగిన వారు అవుతామనితద్వారా సమాజభివృద్ధికి తోడ్పడినవారు కాగలుగుతారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన పలువురు ప్రభుత్వ అధికారులు ఎంపీఓసి రామ్ రెడ్డి అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి

● మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

**గద్వాల అక్టోబరు26 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్లో రేపు మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించ తలపెట్టిన మాలల ఆత్మగౌరవ సభకు జోగులాంబ గద్వాల జిల్లా నుంచి పెద్ద ఎత్తున మాల సోదరులు తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు.శనివారం గద్వాలలోని దళిత ఐక్యవేదిక కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. వత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగి మాలలకు అన్యాయం తలపెడితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనుకున్నది సాధించేవరకు దశలవారీగా పోరాటం సాగిస్తామన్నారు. మాల జన గర్జనతో రాజధాని నగరాన్ని దిగర్బంధం చేద్దామన్నారు. అనుకున్నది సాధించేవరకు అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చేదాకా రాజీలేని పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ధరణి లోపాలతో పేదలు నష్టపోతున్నారు

**వెల్దండ, అక్టోబరు 26 ప్రభాతవార్త:** ధరణి యాప్‌లోని లోపాలతో పేదలు నష్టపోతున్నారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వై.శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు కలిసి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ధరణియాప్‌లోని లొసుగులతో నిరుపేదల భూములు ఇతరులకు బదిలీ అవుతున్నాయని, చెర్కూర్, కుప్పగండ్ల, రాఘాయిపల్లి,బొల్లంపల్లి,అజీలాపూర్ గ్రామాల్లోని పేదల భూములను కాజేస్తున్నారని, ఇట్టి విషయాన్ని అధికారులు గ్రహించి పేదలకు న్యాయం చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి, సింగిల్ విండో మాజీచైర్మన్ మోహన్‌రెడ్డి,నాయకులు జూలూరి బాలస్వామి,మట్ట పరమేష్‌గౌడ్, శ్రీనివాసాచారి, మట్ట విష్ణుగౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రజా రైతు సదస్సును జయప్రదం చేయండి

● బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టి యాదవ్

**పెబ్బేరు అక్టోబరు 26 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణంలోని శనివారం రోజు వనపర్తి జిల్లా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 29న వనపర్తి పాలకేంద్రం దగ్గరలో పదివేల మందితో నిర్వహించే ప్రజా రైతు సదస్సును విజయవంతం చేయాలని ముఖ్య అతిథులుగా మాజీ ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, జిల్లా మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న మోసాలనుతెలియజేస్తూ, పంటకి 500 బోనస్, ఎకరానికి 15వేల భరోసా, రైతు కూలీలకు 12 వేలు, ఇలా 420 హామీలని అమలు చేస్తానని చెప్పి ఓట్లు దండుకొని గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ ని నిలదీయాలని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వనం రాములు, పట్టణ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి, వైస్ చైర్మన్ కర్రస్వామి, కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, మేకల సుమతీ ,ఎల్లయ్య, ఎద్దుల సాయినాథ్ , మజీద్ , మనెం తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**ఇటిక్యాల,అక్టోబరు 26 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామ శివారులో భారీ వర్షాలకు పొలాలకు వెళ్లే దారిలో దెబ్బతిన్న వాగు కల్వర్టు పై రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామ శివారులో గల ఎర్రవల్లికి వెళ్లే దారిలో గల శేషురెడ్డి వాగు దెబ్బతినగా కల్వర్టు వాగుపై రైతులు పొలాలకు వెళ్లేందుకుగాను సిసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించగా రూ.5 లక్షల నిధులతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ నిర్మాణ పనులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి భూమిపూజ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అల్లా బకాష్, కృష్ణ, ఈదన్న, మహేష్, శ్రీరాములు, రవింద్రబాబు, మాబు, నరసింహ ఉన్నారు.


సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

## భక్తి శ్రద్ధలతో శనేశ్వర స్వామికి పూజలు

**బిజినపల్లి,అక్టోబరు26 ప్రభాతవార్త:** నందివడ్డెమాన్ గ్రామంలో వెలసిన శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం ప్రత్యేకంగా తిల తైలాభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డా. గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ శనివారంవివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు,భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నట్లు తెలిపారు. బ్రహ్మసూత్రం గల పరమశివుని దర్శనం చేయడం పుణ్య ఫలితమని అన్నారు. భక్తుల శనిగ్రహ జన్మరిత్యా గోచార రిత్యాఉన్న గ్రహదోష పరిహారానికి, శాంతి కొరకు శనేశ్వర స్వామిని నవ్వుల నూనె, జిల్లెడుపూలు, జమ్మి, జిల్లెడు ఆకులతో స్వామివారిని పూజించారని అన్నారు. అనంతరం బ్రహ్మ సూత్రం గల పరమశివునికి ఈరోజు భక్తులకే రుద్రాభిషేక పూజలు,అర్చనలు ప్రత్యేకంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గణపతి, నందీశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.గోపాలరావు, ఆలయ కమిటి సభ్యులు వీరశేఖర్,ప్రభాకర్, పుల్లయ్య, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, జయంత్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


శనీశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

## ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చెక్కు అందజేత

**వీపనగండ్ల అక్టోబరు26 ప్రభాతవార్త:** మండలంలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన సగనమోని కృష్ణయ్య (వయస్సు 38) ఇటీవల అనారోగ్యంతో చనిపోగా శనివారం వనపర్తి ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ వి.దిలీప్ కుమార్ రెడ్డి 2.75 లక్షల భీమా చెక్కును మృతుడి భార్య కాశమ్మ కు అందజేశారు. వివరాల్లోకెళితే గత రెండు సంవత్సరాల క్రితం ఎస్బిఐ లైఫ్ నుండు స్వధన్ ప్లస్ పాలసీ 5000/- ప్రీమియం చొప్పున తీసుకోవడం జరిగింది అని ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ ఎస్. చంద్రశేఖర్ తెలిపారు. గత జూలై నెలలో అనారోగ్యంతో చనిపోగా విషయం తెలుసుకున్న అడ్వైజర్ చంద్రశేఖర్ డెత్ క్లెయిమ్ కు సంబంధించిన డాక్యుమెంట్లను త్వరగా అందజేసే విధంగా కుటుంబానికి ఎంతె సహకరించాడని బిజినెస్ మేనేజర్ వి.వెంకట్రావు అభినందించారు. ఈ డబ్బులు మా పిల్లల చదువులకు ఎంతో ఉపయోగపడుతాయని,ఆయన తెలిపారు. అయితే ఎస్బిఐలో ఇన్సూరెన్స్ చేసుకుంటే అకౌంట్ ఖాతాదారులకు లైఫ్ సెటిల్ అయ్యే అవకాశం ఉంటదని కుటుంబం వీధిన పడకుండా తదనంతరం ఆర్థికంగా వారికి లబ్ధి చేపడుతుందని,మీరు కూడా ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ చేసుకోవాలని మృతుడి భార్య కాశమ్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ ఆర్ మౌలాలి,శ్యామ్ సుందర్‌రెడ్డి, మోహన్ గౌడ్,శ్రీనివాసులు, రాములు, శంకర్ పాల్గొన్నారు.


మృతిడి కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

## పాఠశాలకు గ్యాస్ సిలిండర్ బహుకరణ

**వెల్దండ, అక్టోబరు 26 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న సమయంలో విద్యార్థులకు అందించే భోజనాన్ని తయారు చేయడానికి కట్టేలపోయి వాడుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని గ్రహించిన పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షులు, పాఠశాల ఉపాధ్యాయులు ఏ.రాజేందర్‌రెడ్డి తన వ్యక్తిగతంగా గ్యాస్ సిలిండర్, స్టవ్‌ను సమకూర్చి ఎంఈఓ చంద్రుడు చేతుల మీదుగా పాఠశాల జీహెచ్ఎం సుగుణకు అందించారు.ఈ సందర్భంగా పాఠశాలకు గ్యాస్ సిలిండర్, స్టవ్‌ను సమకూర్చిన ఉపాధ్యాయుడు రాజేందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్‌ను బహుకరిస్తున్న ఉపాధ్యాయులు

## మత్స్యకారులు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**బిజినపల్లి,అక్టోబరు26 ప్రభాతవార్త:** మత్స్యకారుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా జీవనోపాధి మెరుగు పరచుకోవాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార కార్పోరేషన్ ఉపాధ్యక్షులు తుమ్మల అల్లోజి కోరారు. ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఆయా గ్రామాల మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం 100శాతం సబ్సిడితో అందించే చేప పిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గడిచిన నాలుగు సంవత్సరాలుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో చెరువులు, కుంటలకు జలకళ లేక మత్స్య కార్మిక కుటుంబాలకు ఆర్థిక చేయూత లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు నిండిన కుంటలు చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేయటం ద్వారా సహజంగా ఉత్పత్తి అయ్యే మత్స్య సంపదకు తోడు విడుదల చేసిన చేపలు కూడా పెరిగి మత్స్య సంపద వృద్ధి అవుతుందని చెప్పారు. తద్వారా మత్స్యకారుల ఆర్థిక స్థితిగదులు మెరుగుపడతాయని చెప్పారు. చేప పిల్లల పంపిణీ మత్స్యకారులకు వరం అని, రాబోయే రోజుల్లో ఈ చేప పిల్లలు పెరిగి మత్స్యకారులకు ఎంతో ఉపాధి కలిగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు గంగారామ్, శ్రీకాంత్, మత్స్య పారిశ్రావమిక జిల్లా డైరెక్టర్లు, బజారు మంజుల, రాములు, మస్కూరి బంగారయ్య, గడ్డి గోపుల చేతన్,గౌరారం శ్రీశైలం, ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు మత్స్యకారులు పాల్గొన్నారు.


మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేస్తున్న అధికారులు

## పేట శక్తిపీఠానికి కాకర్ల భీమయ్య బియ్యం దానం

**నారాయణపేట టౌన్,అక్టోబరు 26 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శక్తి పీఠానికి అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు కాకర్ల భీమయ్య శనివారం బియ్యాన్ని దానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శక్తిపీఠం వ్యవస్థాపకులు సంత్‌శ్రీ శాంతానంద్ పురోహిత్ స్వామి చేస్తున్న నిత్య అన్నదాన సేవలను గుర్తించి 50 కేజీల బియ్యాన్ని అందజేయడం జరిగిందన్నారు. శాంతానంద స్వామి వెంట ప్రతి ఒక్కరు ఉండి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా శక్తిపీఠంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలను, వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించి నిత్యాన్నదాన కార్యక్రమాలను చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. రాబోయే రోజులలో శక్తిపీఠం సేవలు మరింత విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం స్వామి ఆశీర్వచనాలు పొందారు.



శక్తిపీఠానికి బియ్యం దానం చేస్తున్న దృశ్యం

# నల్లబిల్లుల రద్దుకు కౌన్సిల్ ఆమోదం!

**భూత్పూర్,అక్టోబరు 26,ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీలో నల్లబిల్లులే ఉండరాదని శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు.మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఫ్లోర్ లీడర్ తూము శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదించిన కుళాయి బిల్లులు రద్దును సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ తాగునీటి ఎద్దడిని తొలగించేందుకు భగీరథ యత్నంగా మిషన్ భగీరథ పేరిట వేల కిలో మీటర్ల నుంచి తాగునీటిని రప్పించి కుళాయిల ద్వారా ఇంటింటికి మంచినీళ్లు అందించడంతో పాటు మిషన్‌భగీరథ పథకం కింద తాగునీటికి కుళాయిల బిల్లులు వసూలు చేయరాదని తీర్మానం చేసి అమలు చేశారని,ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం మూడేళ్ల కుళాయిల బిల్లులు వసూలు చేయాలని జీఓలు జారీ చేయడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమని పేర్కొన్నారు.సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ మాట్లాడుతూతాగునీటిపై బిల్లులు వసూలు చేయడం,సామాన్యునిక కనీస అవసరాల్లో అత్యంత ముఖ్యమైన మంచినీళ్లపై ప్రభుత్వ కఠినంగా ప్రవర్తించడం,కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సబబు కాదని అన్నారు.సమావేశంలో సభ్యులు ప్రవేశపెట్టి తీర్మానం చేసిఆమోదించిన తీర్మాన ప్రతిని మున్సిపాలిటీ ద్వారా ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నట్లు చైర్మన్‌తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలకోటి,గడ్డం నాగమ్మ,రామకృష్ణ,మూష కృష్ణవేణి,గోపాల్‌తో పాటు కోఆప్షన్ సభ్యులు అజీజ్,జాకీర్‌తో పాటు మేనేజర్ శంకర్ నాయక్, మున్సిపల్ ఏఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్

## మరుగుదొడ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

■వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి అక్టోబరు26 ప్రభాతవార్త:** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి ఇప్పటికే మంజూరు అయిన వాటికి మరుగుదొడ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ రాజ్ శాఖ, ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులకు పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో వేగంగా మరమ్మత్తులు పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల మరమ్మత్తుల విషయంలో అలసత్వం వహించరాదని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను సంబంధించి ఇప్పటికే మంజూరు అయిన మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభం కానివి వెంటనే స్టార్ట్ చేయాలని, ఇప్పటికే స్టార్ట్ అయినవి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బడుల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్‌మల్లయ్య, ఈడబ్ల్యూఐడీసీ డీఈఈ వెంకట్‌రెడ్డి, ప్రణాళికాధికారి,డిఈలు,ఏఈలు పాల్గొన్నారు.


జిల్లా పంచాయతీ రాజ్ శాఖ, ఈడబ్ల్యూఐడీసీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయి

**వీపనగండ్ల అక్టోబరు26 ప్రభాతవార్త :** యువకులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని వీపనగండ్ల ఎస్సై కే రాణి తెలిపారు. శనివారం నాడు వీపనగండ్ల మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. దీపావళి పండుగ గంగమ్మ జాతర సందర్భంగా వీపనగండ్ల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం నాడు 38 టీములు రాగా వారికి పోటీలను ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా వీపనగండ్ల ఎస్సై కే రాణి పాల్గొని ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ పండుగల సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో యువకులు డ్రగ్స్, పేకాట, మద్యం, వ్యసనాలకు బానిసలు వివిధ చిల్లర దొంగతనాలకు కూడా పాల్పడే పరిస్థితులు ఉంటున్నాయని వాటిని మాన్పించడం కోసం క్రీడల వైపు మళ్ళించడం మంచి పరిమాణం అని ఆమె తెలిపారు. చిత్తు బొత్తు ఆటల వైపు కూడా ముగ్గుతో ఉంటారని వాటిని గ్రామీణ ప్రాంతాల్లో ఉండేటువంటి పెద్దలు నివారించడానికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ టోర్నమెంట్‌ను ముంత మల్లయ్య యాదవ్ టాస్ వేసి ప్రారంభించగా బ్యాటు పట్టి దారాసింగ్ రిబ్బెను కటింగ్ చేసి ఆటను ప్రారంభించారు. ఈ క్రీడల ప్రారంభంలో వీపనగండ్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదాల బీరయ్య యాదవ్, తెలంగాణ దండోరా వ్యవస్థాపకులు మీసాల రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్ రెడ్డి, గోపాల్ నాయుడు కటిక రఘు క్రీడల్లో పాల్గొన్నారు.


క్రీడలు ప్రారంభిస్తున్న ఎస్సై కే రాణి

## ఆర్గానిక్ ఆకుకూరలతో విద్యార్థులకు పౌష్టికాహారం

**పెబ్బేరు అక్టోబరు26 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం యాపర్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో సేంద్రియ సాగు విధానాన్ని విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం అవగాహన చేయటం, బడి తోటలో పండిన ఆకుకూరలతో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యా ర్థులతో పౌష్టికాహార లోపాన్ని తక్కువ ఖర్చుతో సరి చేయవచ్చని పాఠశాల ఆవరణంలో దేశవాళీ విత్తనాలతో బడి తోటను ప్రధానో పాధ్యాయులు ఉస్సేన్,భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది.కార్యక్రమానికి గ్రామ పెద్దలు నరేందర్ రెడ్డి హాజరై బడి తోటను పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమని తెలిపారు. దాంతో పాటు అమ్మ కోసం ఒక మొక్కు అనేటు వంటి కార్యక్రమంలో భాగంగా హరితహార కార్యక్రమాన్ని చేపట్టాలని నాటిన మొక్కలను జంతువుల నుంచి కాపాడడం గురించి దాదాపు 200 అడుగుల ఐరన్ జాలి,సిమెంట్ స్తంభాలను పాతించటానికి అయ్యే ఖర్చు దాదాపు 40000 దాకా ఉంటుంది.వాటిని గ్రామ పెద్ద నరేందర్ రెడ్డి విరాళం ఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు మురళీకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమాన్నంత దిగ్విజయంగా పూర్తి చేశారని ఉపాధ్యాయ బృందం తరపున వారికి వివరించారు. అంతేకాక వీరితో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, అంగన్వాడీ టీచర్లు అల్లి రాణి,సౌందర్య ఆయాలు శంకరమ్మ, చంద్రకళ రైతు కమిటీ కోశాధికారి స్వరాజ్యం బాబు, గ్రామస్తులు రాణి మొదలగువారు పాల్గొన్నారు.



## ఆడబిడ్డల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**చిన్నచింతకుంట,అక్టోబరు 26 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి పేరిట ఆర్థిక సాయం అందిస్తూ వారి కళ్ళల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు.శనివారం మండల కేంద్రంలోని మండలమహిళా సమాఖ్య భవన సమావేశ హాలులో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై 18మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని రాష్ట్రంలోని పేద వర్గాలకు అండగా ఉంటుందన్నారు. ఆరు గ్యారంటీ పథకాలలో మహిళలకు పెద్దపీట వేశామని, కాంగ్రెస్ పార్టీ అమలు చేసే పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఎల్లయ్య, ఎంపిడిఓ సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్‌లు సురెందర్‌రెడ్డి, ఉమా మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరెందర్‌రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వెంకటేష్, మాజీ కో ఆప్షన్ మహిమూద్, వట్టెం శివ, పర్దీపురం వెంకటేష్ పాల్గొన్నారు.


కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ముదిరాజ్‌లు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

■పేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివవీరారెడ్డి

**నారాయణపేట టౌన్,అక్టోబరు26 ప్రభాతవార్త:** కులవృత్తి పరంగా ముదిరాజ్‌లు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందని మార్కెట్ కమిటి ఛైర్మన్ శివారెడ్డి, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ కొనంగేరి హనుమంతు అన్నారు. శనివారం మత్స్య సహకారసంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్‌కుమార్ ముదిరాజ్ అధ్యక్షతన నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామ చెరువులో చేప పిల్లలను వదిలారు. అనంతరం వారు మట్లాడుతూ ముదిరాజ్‌ల హక్కు వారి కులవృత్తి చేపల వృత్తి అన్నారు. గ్రామస్థాయిలో ముదిరాజ్‌లను ఆర్థికంగా ఎదగాలని లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి అవకాశాన్ని ముదిరాజ్‌లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చెరువులో చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

## తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డికి ఘన సన్మానం

**కల్వకుర్తి, అక్టోబరు 26 ప్రభాతవార్త:** ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులుగా ఎన్నికైన వంగూరు మండల మాజీ జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డిని శనివారం కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జల సాధన సమితి ఆధ్వర్యంలో కల్వకుర్తితో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించేందుకు నిరంతరం ఉద్యమాలు చేసిన గొప్ప నేత కేవీఎన్‌రెడ్డి అని కొనియాడారు. కేవీఎన్‌రెడ్డిని వ్యవసాయ కమిషన్ సభ్యులుగా ఎంపిక చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేవీఎన్‌రెడ్డిని సన్మానించిన వారిలో విజయభాస్కర్, ముత్యాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎంపీ, ఎమ్మెల్యేను సన్మానించిన మండల కాంగ్రెస్ నాయకులు



**వెల్దండ, అక్టోబరు 26 ప్రభాతవార్త:** జిల్లా అభివృద్ధి పర్యటనలో భాగంగా అచ్చంపేట నియోజకవర్గానికి తరలివెళ్తున్న నాగం కర్నూల్ ఎంపీ, కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులు మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలను వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవిని, ఎమ్మెల్యే వంశీకృష్ణలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్వత్‌రెడ్డి,వెంకటయ్య, పుల్లయ్య,వెంకట్‌నాయక్, రాంచంద్రయ్య, రమేష్, కాదూరాం, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డికి ఘన సన్మానం


కేవీఎన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, అక్టోబరు26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులుగా నియమితులైన కేవీఎన్‌రెడ్డిని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో శనివారం వెల్దండ మండల నాయకులు రవియాదవ్, బొజ్జయ్య, సుకుమార్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కేవీఎన్‌రెడ్డికి ఉన్న అనుభవాలతో రైతులకు ఎంతోలబ్ధి చేకూరుతుందన్నారు. కేవీఎన్‌రెడ్డిని సన్మానించిన వారిలో వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## ఎల్ఓసి లెటర్ అందజేసిన ఎమ్మెల్యే


ఓల్ఓసి లెటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**బిజినేపల్లి,అక్టోబరు 26 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయ నిధిలో భాగంగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి రూ.3.5 లక్షల ఎల్ఓసి లెటర్ గౌరారం తండాకి చెందిన ఇస్లావత్ హిర్యాకు అందించారు. నిరుపేద గిరిజనుడైన హీర్య గత మూడు నెలలుగా గుండె సంబంధిత వ్యాధులతో తీవ్రంగా బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్స్ ఆసుపత్రిలో వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధిలో భాగంగా రూ. 3.5 లక్షల ఎల్ఓసి లెటర్ శనివారం అందించారు. ఆపదలో ఉన్న గిరిజనుడి వైద్యం కోసం చూపిన చొరవకు గిరిజన నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు గోవింద్ నాయక్, రవిందర్ నాయక్, పాండునాయక్, గోపాల్ నాయక్‌లు ఉన్నారు.

## బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

**కల్వకుర్తి, అక్టోబరు 26 ప్రభాతవార్త:** చారకొండ మండలం శిర్సనగండ్ల, శాంతిగూడెం మార్గంలో బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చారకొండ మండల కేంద్రానికి చెందిన కేశమోని శ్రీనివాస్‌గౌడ్ (54) శనివారం ఉదయం శిర్సనగండ్ల గ్రామంలో ఒకరికి కట్లు కట్టి తిరిగి వస్తుండగా శాంతిగూడెం సమీపంలో మూలములపు వద్ద అదుపు తప్పి బైక్ క్రిందపడటంతో శ్రీనివాస్‌గౌడ్‌కు గొంతుకుడి భాగంలో వాహనం యొక్క హ్యాండిల్ లోపలికి కుచ్చుకొనిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శిర్సనగండ్ల నుంచి చారకొండకు వస్తున్న ఓ వ్యక్తి శ్రీనివాస్‌గౌడ్‌ను గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి 100కు డయల్ చేసి వివరాలు తెలిపాడు. సంఘటన స్థలానికి హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం పరిశీలించి పంచానామ నిర్వహించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంషుద్దిన్ తెలిపారు.

## విద్యుదాఘాతానికి గురై మహిళా మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబరు 26 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటి దేశిఇటిక్యాల గ్రామానికి చెందిన కూరస్వామి భార్య భాగ్యమ్మ (28) శనివారం ఉదయం ఇంటి ముందు వాకిలి ఊడుస్తుండగా వాకిట్లో తెగిపడిన విద్యుత్ వైరును తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది.చాలా రోజులుగావిద్యుత్ వైర్లు సరిచేయాలని విద్యుత్ అధికారులకు మొర పెట్టుకున్న సరిచేయకపోవడంతో నిండు ప్రాణం బలైందని గ్రామస్తులు పేర్కొన్నారు.విద్యుత్ శాఖ అధికారులు వచ్చే వరకుమృతదేహన్ని ఇక్కడి నుంచి కదిలించేది లేదని ప్రభుత్వాసుపత్రి ముందుప్రధాన రహదారిపైరాస్తారోకో నిర్వహించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి కుమార్ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులకారణంగానే భాగ్యమ్మమృతి చెందిందని, ఆ కుటుంబంలోఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూఐదు ఎకరాల పొలాన్ని అందించాలని డిమాండ్ చేశారు.అనంతరం మృతురాలి కుటుంబసభ్యులకు నచ్చజెప్పడంతో రాస్తారోకోను విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

## ఊరకుక్కల దాడిలో పది మేక పిల్లలు మృతి

**బిజినపల్లి,అక్టోబరు26 ప్రభాతవార్త:** గంగారం పరిధిలోని వసురాం తండా పంచాయతీ పరిధిలోని అలుగు తండాలో శనివారం కుక్కలదాడిలో పది మేక పిల్లలు మృతి చెందాయి. బాధిత దంపతులు నార్యనాయక్, చాందీలు తెలిపిన వివరాల ప్రకారం రోజులాగే మేకలు మేతకు తీసుకెళ్లగా పిల్లలను ఇంటిముందు జల్లకింద ఉంచారు.జల్లను పైకి లేపిన ఊర కుక్కలు మేక పిల్లలపై దాడిచేసి పదింటిని చంపేశాయి. సాయంత్రం ఇంటికివచ్చి పరిశీలించగా రూ. 80 వేల విలువైన మేక పిల్లలు మృతి చెంది ఉండడంతో గిరిజన దంపతులు బోరున విలపించారు. బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు.

# మద్దూర్ సతీష్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి పరామర్శ



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్,ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

సోదరి వీరమణి బిడిఎస్ పూర్తి చేసిన తన కొడుకుకు ఉద్యోగ అవకాశం కల్పించాలని సీఎంకు విన్నవించారు. సతీష్ కుటుం బాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ గరిమానరుల, జోగు లాంబ గద్వాల జోన్ 7డిఐజి ఎల్ఎస్ చౌహాన్, జిల్లా ఎస్పీ యోగేష్‌గౌతమ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్‌వార్ల విజయ్‌కుమార్, మద్దూరు జడ్పీటిసి రఘుపతిరెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉన్న వారు బయట డబ్బులు వెచ్చించి చేయించుకోవాల్సి వస్తుందని,ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం కలక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వార్డులు అన్ని తిరుగుతూ రోగులతో మాట్లాడారు. వైద్యం అందుతున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శాస్త్ర చికిత్స నిమిత్తం ఏర్పాటు చేస్తున్న ఆపరేషన్ థియేటర్ గది మరమ్మత్తు పనులను పరిశీలించారు. మరమ్మత్తు పనులు పూర్తి అయ్యేలోపు కంటి శాస్త్ర చికిత్సకు అవసరమైన యంత్ర సామాగ్రిని తెప్పించాలని, నవంబర్ 4వ తేది వరకు ఆపరేషన్ థియేటర్ పూర్తి కావాలని ఆదేశించారు. ఆసుపత్రిలో డయాలసిస్ వైద్య కేంద్రం పై అంతస్తులో ఉన్నందున రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అందువల్ల రోగులను తరలించడానికి అవసరమైన లిఫ్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం,సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకట్ బాడీస్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జయ చంద్ర మోహన్, ప్రోగ్రాం ఆఫీసర్లు డా సాయినాథ్ రెడ్డి డడా.పరిమళ,ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంగారావు, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ,టి.ఎస్.యం.ఐ.డి.సి కార్యనిర్వాహక ఇంజనీరు జైపాల్ రెడ్డి, డి.ఈ.ఏ.ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్టు పంచాయితీ

(మొదటి పేజీ తరువాయి)



ఫారెస్టు అధికారులు, రేంజర్ చంద్రశేఖర్ తదితరులు

ఫారెస్టు అధికారుల మధ్య తోపులాట జరిగింది. గిరిజన మహిళ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మ హత్యాయత్న చేయగా బంధువులు కాపాడారు. గత 20 సంవత్సరాల నుంచి భూమిసాగు చేసుకుంటున్నామని ఫారెస్టు అధికారులు దౌర్జన్యంగా వచ్చి పంటను తీసివేసి చెట్లు పెడుతు న్నారని గిరిజనులు వాపోయారు. మా భూమి మాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 3 నెలల నుంచి ఫారెస్టు భూములను చెట్లు నరుకుతూ సాగు చేస్తున్నాని అడ్డుకుని చెట్లు పెడుతున్నామని ఎఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. గిరిజనులకు ఎలాంటి పట్టాలు లేవని ఆయన అన్నారు. ఫారెస్టు భూములలో చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ హెచ్చరించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటాలి

### -రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న



దన్నారం బాలును సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, అక్టోబరు 26 ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ సత్తా చాటాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంతటి నాగన్న కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం కల్వకుర్తి అసెంబ్లీలో బహుజన్ సమాజ్ పార్టీ సన్నాహక సమావేశాన్ని కల్వకుర్తి నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షులు ఎట్టి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న హజరై మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ పోటీకి సిద్దం కావాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో మన పార్టీ గెలుపు దిశగా అడుగులు వేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం కల్వకుర్తి అసెంబ్లీ అధ్యక్షులుగా దన్నారం బాలును నియమించి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి యోసేపు, ఎట్టి ఆంజనేయులు, గడ్డమీది వెంకటయ్య, కావలి మహేష్, రమేష్, అనిల్, మహేష్, ప్రవీణ్, డొక్కు, రాజు, రేణుకా పారిజాతం తదితరులు ఉన్నారు.

## తాళం వేసిన ఇండ్లలో చోరీ



**మక్తల్,అక్టోబరు 26 ప్రభాతవార్త:** తాళం వేసిన ఇండ్లు టార్గెట్‌గా పట్టపగలే గుర్తు తెలియని దొంగలు రెచ్చిపోతున్న వరుస ఘటనలు మక్తల్ మండలం కర్నిలో ప్రజలకు భయాందోళనకు గురి చేస్తు న్నాయి. శుక్రవారం పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరగ్గా శనివారం కూడా సరిగ్గా అదే సమయంలో అదే కాలనీలో చోరీ జరగడం ఆందోళనను రేకెత్తిస్తున్నది. గ్రామానికి చెందిన గుంటప్పగౌడ్ ఇంట్లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరు వాలో ఉన్న రూ.60 వేల నగదును దోచుకెళ్లగా, శనివారం మధ్యాహ్నం 12 గం.ల ప్రాంతంలో అదే కాలనీకి చెందిన ఉప్పరి చంద్రకళ అనే మహిళ ఇంట్లో దాదా పు రెండు లక్షల నగదును దుండగులు దోచుకెళ్లారు. వరుసగా రెండు రోజులు పట్ట పగలే చోరీలు చోటు చేసుకోవడంతో మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి శనివారం మధ్యాహ్నం చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించి బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చోరీలకు పాల్పడిన దుండగులను గుర్తించి త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. బంగారం, నగదు ఇండ్లలో ఉంచకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని ఆయన కోరారు.

## ఫార్మాసిస్టులదే భవిష్యత్తు

◆పీయూ ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్ ◆ గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

**మహబూబ్‌గర్ బ్యూరో,అక్టోబరు 26 ప్రభాతవార్త:** ఫార్మసిస్టులదే భవిష్యత్తు అని, ఫార్మారంగం దినదినాభివృద్ధి చెందుతుందని దేశంలో హైదరాబాద్ ఫార్మా రంగంలో కీలకమని, బి ఫారం చేసిన తర్వాత యూనివర్సిటీలో ఎంఫార్మ్, పిహెచ్‌డి చేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలని పియూ ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్ ఆకాంక్షించారు. సరోజినీ రాములమ్మ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 23వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు విసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసిస్టులు రోగులకు డాక్టర్లకు అనుసంధానంగా ఉండి సమాజ సేవ చేస్తున్నారని అన్నారు. అనంతరం కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో సరోజినీ రాములమ్మ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ అధ్యాపకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# కొలువుదీరిన పాలకమండలి

### హాజరైన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

**చిన్నచింతకుంట,అక్టోబరు 26 ప్రభాతవార్త:** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన నూతన పాలక మండలి శనివారం కొలువుదీరింది. స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి పాలక మండలి సభ్యులందరూ కొండపై గల స్వామివారి ప్రధానాలయంలో దేవస్థాన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నూతన పాలక మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేతో పాటు నూతన పాలక మండలి సభ్యులను శాలువాతో సత్కరించారు. అక్కడ నూతన పాలక మండలి సభ్యులందరూ కలిసి గౌని గోవర్ధన్‌రెడ్డిని నూతన దేవస్థాన ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆయన దేవస్థాన ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కొండ దిగువన జాతర మైదానంలో ఏర్పాటు చేసిన సభలో స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ దేవస్థాన నూతన పాలక మండలి సభ్యులు భక్తుల మనోభావాలను గౌరవిస్తూ పని చేయాలని ఆయన సూచించారు. శ్రీకురుమూర్తి జాతర అంటేనే సామాన్య భక్తుల జాతర ఈ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలకమండలి సభ్యులు పని చేయాలన్నారు. శ్రీ కురుమూర్తి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు ఏర్పాట్లపై స్థాయి అధికారులకు తెలపాలన్నారు. విఐపి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భక్తులకు ప్రాధాన్యత ఇవ్వకుండా సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. ఆలయ విశిష్టతకు భంగం కలగకుండా నూతన పాలకవర్గం సభ్యులు నడుచుకోవాలన్నారు. జాతరలో పాలక మండలి సభ్యుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భక్తుల నుంచి విమర్శలు వస్తాయన్నారు. ఈసారి టాయిలెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వచ్చే బ్రహ్మోత్సవాల వరకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా టాయిలెట్లను పూర్తిస్థాయిలో నిర్మిస్తామన్నారు. స్వామివారి సన్నిధిలోనే కళ్యాణాలు జరుపుకునేందుకు కళ్యాణ మండపాన్ని నిర్మించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీ కురుమూర్తి స్వామి కొండపైకి రోడ్డు సౌకర్యం కోసం రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని త్వరలోనే ఘాట్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు రావచ్చన్నారు. ఈ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు నేను పర్యవేక్షిస్తానని జాతర ముగిసే వరకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, మదనాపూర్ మార్కెట్ కమిటి ఛైర్మన్ ప్రశాంత్, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, నాయకులు అరవింద్‌కుమార్‌రెడ్డి, కథలప్ప వివిధ గ్రామల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా డీసీఎంఎస్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

### వేడుకలకు హాజరైన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు



**బాలానగర్,అక్టోబరు 26 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం బాలానగర్ మండలం పెద్దాయపల్లి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు మాజీ మంత్రులు డా. లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రులు డా. లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్‌తో పాటు ఎమ్మెల్సీ నవీన కుమార్‌రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఈ స్థాయికి రావడానికి ప్రధాన కారణం మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి అని తెలిపారు. వెన్నుపోటు రాజకీయాలు చేసిన వారు బాగుపడినట్లు చరిత్రలో లేదని, అలా వెన్నుపోటు పొడిచే వర్గం ఇక్కడ లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, బిఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు రోజు రోజుకు పెరిగిపోతుందని తెలిపారు. తన జన్మదిన వేడుకలకు హాజరై, ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు బాలానగర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి పెద్దాయపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు హాజరయ్యారు.

## రాజేశ్వరి మృతిపై ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు



స్మృతి వనంలో సమావేశం అయిన అఖిల పక్ష నాయకులు

**గద్వాల అక్టోబర్, 26 ప్రభాతవార్త:** బిజ్జారం గ్రామానికి చెందిన వడ్డెర రాజేశ్వరి మృతిపై అచల పక్ష నాయకులు శనివారం గద్వాల లోని స్మృతి వనంలో సమావేశం అయ్యారు. సీడ్ ఆర్గనైజర్ బండ్ల, రాజశేఖర్ రెడ్డి ఇంట్లో రాజేశ్వరి పనిమనిషిగా వుండగా బంగారు దొంగ తనం చేసిందని నేరం కింద పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ అవమానం భరించలేక మనస్తాపం చెందిన రాజేశ్వరి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొన్ని రోజులు వైద్య చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటనపై హత్యా నేరం కింద బండ్ల రాజశేఖర్ రెడ్డి ని అరెస్టు చేయాలని కోరుతూ అచల పక్ష కమిటీ ఎస్పీ కార్యాలయానికి పెద్ద ఎత్తున వివిధ సంఘాలు నాయకులు, పార్టీల నాయకులు, విద్యార్థి నాయకులు, మేధావులు చేరుకున్నారు. ఎస్పీ లేకపోవడంతో ఇంటెలిజెన్సీ ఎస్పీ లేకపోవడంతో ఇంటెలిజెన్సీ సీఐకి మెమోరాండం సమర్పించారు. ఎటువంటి నేరం చేయని బాల కార్మికురాలు వడ్డెర రాజేశ్వరిని బంగారం దొంగతనం కింద నేరం మోపి మల్దకల్ పోలీస్ స్టేషన్కు తరలించడంతో పోలీసులు బెదిరించడం ఆ అవమానాన్ని తట్టుకోలేక పురుగుల మందు తాగి చనిపోయిన విషయం పై ఆ కుటుంబము ఫిర్యాదు చేయకుండగా 13 లక్షల 50వేల రూపాయలు పరిహారము చెల్లించి బాలిక శవానికి వెలగట్టారని పెద్ద ఎత్తున వివిధ వార్తాపత్రికల్లో వచ్చిన కథనాలతో అచల పక్ష నాయకులు రాజశేఖర్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నింద మోపడం వల్లే అవమానాన్ని భరించలేక పురుగుల మందు తాగి పది రోజులు పోరాడి చనిపోయిందని బాలిక మరణానికి కారణము రాజశేఖర్‌రెడ్డి అని దీనికి వత్తాసు పలికిన పోలీసులపై కూడా చట్టపరమైన న్యాయపరమైన శాఖపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసినందున రాజశేఖర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని నిందితుడు పలుకుబడి గల ధనవంతుడు, రాజకీయ పలుకుబడిన ఉపయోగించి అమాయకురాలైన వడ్డెర కుటుంబాన్ని కొనుగోలు చేయటం మైనర్ బాలికను పనిలో ఉంచుకోవడం దొంగతనం నేరం మోపడం వేధించడం పోలీసులతో బెదిరించడం లాంటి అకృత్యమైన పనుల వల్ల అవమానాన్ని భరించలేక చనిపోవడం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని, నేరస్తుడు ఎంతటి వాడైనా వదలకుండగా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గత వారం రోజులుగా అన్ని సంఘాలు అన్ని పార్టీలు మేధావులు విద్యార్థి సంఘాలు ప్రజా సంఘాలు కార్మిక సంఘాలు గొంతెత్తి నినదిస్తున్న నేటికీ పోలీసులు స్పందించకపోవడం ఏమిటని ఇప్పటికైనా వెంటనే జిల్లా ఎస్పీ స్పందించి నేరస్తుల్ని అరెస్టు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎంతటి వారైనా వదిలే సమస్య లేదని రాజశేఖర్ రెడ్డి కోసం గాలింపు చర్యలు చేపట్టామని వివిధ బృందాలు హైదరాబాద్ బెంగళూరువివిధ ప్రాంతాలలో పర్యటిస్తున్నాయని కేసు నమోదు అయినందున వదిలే ప్రసక్తే లేదని పోలీస్ వ్యవస్థ చట్టపరమైన చర్యల్ని తీసుకుంటుందని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. దీంతో ప్రజాసంఘాలు నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అచల పక్ష నాయకులు మధుసూదన్ బాబు,నాగర్ దొడ్డి వెంకట్రాములు, ఆంజనేయులు, వెంకట స్వామి, అతికూర్ రహేమన్ అనేక పార్టీల సంఘా నాయకులు, విద్యార్థి సంఘాల ప్రజాసంఘాల కార్మిక సంఘాలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు.

### నూతన సాంకేతిక పద్ధతులతో

## వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు

(మొదటి పేజీ తరువాయి)



స్టాల్స్ పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్

ఉపయోగించవలసిన పరికరాలు ఎంపిక చేసుకోవచ్చని అన్నారు. ఇలాంటి సదస్సులను వార్షికంగా ఏర్పాటు చేసి ప్రజలకు మరింత తెలియజేసేలా ప్రోత్సాహిస్తున్నామని అన్నారు. మహిళ సహకార సంఘాల ద్వారా బిస్కెట్ మేకింగ్ యూనిట్‌లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సదస్సు ద్వారా రైతులు తమను తాము మెరుగుపర్చుకోవచ్చని, పంటల పెరుగుదల ఖర్చు తగ్గింపు అధిక లాభాలు సాధించేందుకు ఈ అవగాహన కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. అందరూ దీన్ని సద్వినియోగం చేసుకుని మరింత మందికి ప్రోత్సాహకంగా ఉండాలని కలెక్టర్ అన్నారు. గద్వాల్ శాసనసభ్యులు కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, రైతు అవగాహన సదస్సు ప్రతి ఏడాది అక్టోబరు - నవంబరు నెలల్లో నిర్వహిస్తామని తెలిపారు. పాత పద్ధతులను విడిచి కొత్త, ఆధునిక పద్ధతులతో వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. ఈ సదస్సు ద్వారా పల్లె సృజనతో కొత్త, వినూత్న పరికరాలు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రవేత్తల మార్గదర్శకతతో రైతులకు పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఆర్‌డిఓ రామ్ చందర్, మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతు,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్ భాష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియనాయక్ ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

### మండల విద్యాధికారి బషీద్ అహ్మద్

**లింగాల,అక్టోబరు 26 ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అప్పాయిపల్లి, చెన్నంపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన దివ్యను అభినందించిన మాజీ మంత్రి

### రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేత



దివ్యను అభినందిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**బాలానగర్,అక్టోబరు 26 ప్రభాతవార్త:** పేదింటి విద్యా కుసుమం దివ్య ఎంబిబిఎస్‌లో సాటు సాధించడంపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అభినందించారు. బాలానగర్ మండలం తిర్మలగిరి గ్రామానికి చెందిన పేదింటి దళిత కుటుంబానికి చెందిన అంజయ్య కూతురు దివ్య కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు సాధించింది. విషయం తెలుసుకున్న లక్ష్మారెడ్డి విద్యార్థి తల్లిదండ్రులను పిలిపించి అభినందించారు. ఈ మేరకు శనివారం బాలానగర్‌లో దివ్యను సన్మానించి రూ.50 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. మారుమూల గ్రామంనుంచి ఎంబిబిఎస్ సీటు సాధించినందుకు వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంత ఉందని అందుకు వారిని అభినందించారు. పేద విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. దివ్యకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసాని ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతుబిడ్డకు ఎమ్మెల్యే అభినందన

### ఎంబిబిఎస్‌లో సీటు సాధించడంపై ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి ప్రశంస

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 26 ప్రభాతవార్త:** కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని ప్రవళి నిరూపించిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం, కొనగట్టుపల్లికి చెందిన రైతు దంపతులు ఇప్పలి సరళి ఇప్పలి రాములు కుమార్తె ఇప్పలి ప్రవళికకు నీట్ పరీక్షలో 2053 ర్యాంక్ సాధించి వరంగల్, కాకతీయ మెడికల్ కాలేజీలో సీటు సాధించిన సందర్భంగా ప్రవళిక కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా ఆయన ప్రవళికకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. డాక్టర్ అయిన తర్వాత పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత లక్ష్యం నిర్ణయించుకుని అందుకు తగ్గట్లుగా కృషి చేయాలని తెలిపారు. యువత ప్రవళికను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన తెలిపారు.

## దత్తపీఠంలో గురుపారాయణ యజ్ఞం

**మక్తల్,అక్టోబరు 26 ప్రభాతవార్త:** మండలంలోని పసుపుల సమీపంలోని దత్తపీఠంలో శనివారం గురు చరిత్ర పారాయణ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. గతవారం రోజులుగా జరుగుతున్న ప్రత్యేక పూజలు భాగంగా శనివారం ఆఖరి రోజు వేద పండితులతో మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు దత్తాత్రేయ స్వామి సన్నిధిలో పాదాలబండ సమీపంలో క్రిష్ణవేణి మాతా విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాతాజీ నిరంజనా సరస్వతి, ఆలయ సెక్రెటరీ రామలింగారెడ్డి, ఆలయ కమిటి అధ్యక్షులు దత్తప్ప, మాజీ ఎంపిపి వనజమ్మ, సత్యనారాయణ, చిట్యాల లక్ష్మణ్, రంగారెడ్డి, పస్పుల నాగేష్, చక్రధర్, బి. వెంకటేష్, అశోక్‌గౌడ్, పూజారి రఘు, వెంకటేష్, రామకృష్ణ, బద్రి పాల్గొన్నారు.

## జెమిలి ఎన్నికలు అప్రజాస్వామికం

**మాగనూరు,అక్టోబరు 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం దగ్గర నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న జెమిలి ఎన్నికల విధానం అప్రజాస్వామికమని నియంతృత్వ దోరణికి నిదర్శనమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థానిక ఎన్నికలు విడిగి జరగడం ఖర్చుతో కూడిన పని అని అభివృద్ధి కుంటు పడుతుందని వితండ వాదన చేస్తున్నారు. కార్పోరేట్లకు లక్షల కోట్లు రాయితీలు మాఫీలు చేస్తున్న ప్రభుత్వం ఈ వాదన తేలడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనంకోసం ఇలాంటి అప్రజాస్వామిక విధానాలను రుద్దుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, పి. ఆంజనేయులు, సిపిఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు సిఆర్ గోవింద్ రాజులు, సీనియర్ నాయకులు భరత్‌కుమార్, వి.వెంకటయ్య, ఎస్.ఆంజనేయులు,నర్సింహ, అశోక్,బాలు, నరసింహ, నయ్యుమ్, దేవప్ప, ఏరియా కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన కాంప్లెక్స్ ఉపాధ్యాయులు



**కృష్ణ,అక్టోబరు 26 ప్రభాతవార్త:** మండలంలోని మురహరదొడ్డి గ్రామ ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ ఉపాధ్యాయులు గణేష్ సింగ్ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా తరగతుల విద్యార్థుల వద్దకు వెళ్లి పాఠ్యాంశాలను చదివించారు. ఎప్పటి పాఠ్యాంశాలను అప్పుడే చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని అన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా వంటగది, మధ్యాహ్న భోజనం, నాణ్యతను పరిశీలించి వారికి సూచనలు చేశారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈరన్న, ఉపాధ్యాయులు ఎంఆర్ అజయ్‌కుమారి, ఆకాంక్ష ఉన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్

**అయిజ అక్టోబరు 26 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న రూ. 7,500 కోట్లు ఫీజు రియంబర్స్ మెంట్ ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కన్వీనర్ గణేష్, కళాశాలల విద్యార్థులతో కలిసి పట్టణంలోర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్త బస్టాండ్ కూడలిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలోకాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి పది నెలలు కావస్తున్నా విద్యాశాఖకు మంత్రినినియమించకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. విద్యారంగాన్ని ప్రక్షాళన చేస్తామని ప్రగల్బాలు పలికి విద్యార్థులజీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. స్కాలర్షిప్ వెంటనే విడుదల చేసి పేదవిద్యార్థులను ఆదుకో వాలన్నారు. లేని పక్షంలోఆందోళన ఉధృతంచేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీధర్ రెడ్డి, నరేష్, లోకేష్, సద్దాం,అశోక్, రాఘవేంద్ర, మురళి, మహేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

